నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
3 | ఖమ్మం, శనివారం 2 మార్చి 2024 | BHADRADRI KOTHAGUDEM

201 పనులకు.. రూ.9.38 కోట్లు మంజూరు

బీఆర్ఎస్ లోక్‌సభా పక్ష నేత, ఎంపీ నామా వెల్లడి

ఖమ్మం, మార్చి 1 : తన ఐదేళ్ల పదవీ కాలంలో వివిధ అభివృద్ధి పనులకు వంద శాతం నిధులు సద్వినియోగం చేసుకున్నామని, ఉమ్మడి జిల్లాకు తన ఎంపీ నిధుల నుంచి 218 పనులకు.. రూ.9.80 కోట్లతో ప్రతిపాదనలు పంపగా.. ఇప్పటివరకు 201 పనులకు.. రూ.9.38 కోట్లు మంజూరైనట్లు బీఆర్ఎస్ లోక్‌సభా పక్ష నేత, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. మంజూరైన ఎంపీ నిధులను సీసీ రోడ్లు, కల్వర్టులు, పాఠశాలలు, హెల్త్ సెంటర్, అంగన్‌వాడీ భవనాల ప్రహరీల నిర్మాణానికి, విద్యుత్ స్తంభాలు, కొత్త లైన్‌ల ఏర్పాటుకు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 19 పనుల కోసం రూ.79.50 లక్షలు, ఖమ్మం జిల్లాలో రూ.4,16,60,000 కేటాయించినట్లు పేర్కొన్నారు. పార్టీ స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకొని ఎంపీ నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఖమ్మం కార్పొరేషన్‌లో 14, 3, 34, 38 డివిజన్లకు తాజాగా ఎంపీ నిధులు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఆయా పనులకు త్వరలోనే శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నట్లు నామా స్పష్టం చేశారు.

మిర్చి రైతుల కన్నెర్ర

- ఖమ్మం ఏఎంసీలో జెండాపాట పూర్తికాకుండానే క్రయ విక్రయాలు
- ఖరీదుదారుల మధ్య పోటీ లేకుండానే జెండాపాట మమ..
- పంటకు గిట్టుబాటు ధర రావడం లేదని రైతుల ఆగ్రహం
- అదనపు కలెక్టర్ జోక్యంతో తర్వాత సజావుగా విక్రయాలు

ఖమ్మం వ్యవసాయ మార్కెట్ ఎదుట రైతుల ఆందోళన

ఖమ్మం వ్యవసాయం, మార్చి 1: ఆరుగాలం కష్టపడి పంటను పండించి మార్కెట్‌కు తీసుకొస్తే కనీస మద్దతు ధర లభించడం లేదని శుక్రవారం రైతులు కన్నెర్ర చేశారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్ ఎదుట ఈ మేరకు కొన్ని గంటల పాటు ధర్నా చేపట్టారు. తెలిసిన వివరాల ప్రకారం.. వారం రోజుల నుంచి ఖమ్మం ఏఎంసీకి జిల్లా నుంచే కాక భద్రాద్రి, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాల నుంచి మిర్చి తరలివస్తున్నది.రోజుకు కనీసం 60 వేల బస్తాలు తగ్గడం లేదు. వ్యాపారులు ప్రతిరోజు ఉదయం నిర్వహించే జెండాపాటలో లేనిపోని సాకులు చెప్పి ధర తగ్గిస్తుండడం, జెండాపాటలో ఖరీదుదారుల పోటీ లేకపోవడంతో రైతులు ఆగ్రహానికి గురయ్యారు. కానీ చివరకు చేసేదేం లేక మార్కెట్ కమిటీ నిర్ణయానికి లోబడి మిర్చి విక్రయించారు. ఇదే కోవలో శుక్రవారం జెండాపాటలో మిర్చి క్వింటాల్‌కు గరిష్ఠ ధర రూ.20,800గా పలికింది. జెండాపాటకు ఖరీదుదారులు ఎక్కువ మంది వస్తే పోటీ పెరిగి పంటకు మంచి ధర వస్తుంది. కానీ ఒకరిద్దరు ఖరీదుదారులు మాత్రమే జెండాపాటకు హాజరు కావడం, మరోవైపు కొందరు వ్యాపారుల గుమస్తాలు పంటకు ఏదో ఒక ధరకు పంటను కొనుగోలు చేస్తుండడంతో రైతులు ఆగ్రహానికి గురయ్యారు. మిర్చి నాణ్యతను బట్టి ధర నిర్ణయించకుండా, అశాస్త్రీయంగా ధరలు నిర్ణయించడం సరికాదని మార్కెట్ ఎదుట ఆందోళనకు దిగారు. ఖమ్మం జిల్లా మంత్రులు, కలెక్టర్ వీపీ గౌతమ్ వెంటనే మార్కెట్‌కు వచ్చి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఒక దశలో మార్కెట్ యార్డు గేట్లను మూసి వేసే ప్రయత్నం చేశారు. సమాచారం అందుకున్న ఏఎంసీ సెక్రటరీ ప్రవీణ్‌కుమార్, జిల్లా మార్కెటింగ్‌శాఖ అధికారి ఎంఏ అలీం, ఉద్యానశాఖ అధికారి రమణ, ఖమ్మం త్రీటౌన్ సీఐ రమేశ్ రైతుల వద్దకు వచ్చి వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ ఫలితం లేకపోవడంతో అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ రంగంలోకి దిగారు. ఆయన స్వయంగా మార్కెట్‌లోకి వచ్చి మిర్చి నాణ్యతను పరిశీలించారు. అనంతరం అదనపు కలెక్టర్ మార్కెట్ కార్యాలయంలో వర్తక సంఘం సభ్యులు, మిర్చిశాఖ, దిగుమతి, ఉద్యాన, వ్యవసాయశాఖ, మార్కెట్ కమిటీ అధికారులతో సమావేశమయ్యారు. మిర్చి ధరలు, జెండా పాట నిర్వహణపై సుదీర్ఘంగా చర్చించారు. అదనపు కలెక్టర్ అనంతరం రైతు సంఘాల నాయకులతో చర్చించారు. పంట నాణ్యతను బట్టే క్రయ విక్రయాలు జరుగుతాయని, జెండాపాట నిబంధనలను కచ్చితంగా అమలు చేస్తామని జెండా పాటకు ఖరీదుదారులందరూ వస్తారని ఆయన ప్రకటించడంతో రైతులు శాంతించారు. చర్చల తర్వాత యథావిధిగా క్రయ విక్రయాలు జరిగాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ఖమ్మం ఏసీపీ రమణమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చేపట్టారు.

రైతులకు సర్ధిచెబుతున్న సీఐ రమేశ్

రైతుల బాధను పట్టించుకోవడం లేదు..

ఏఎంసీ పరిధిలో పంట నాణ్యతకు అనుగుణంగా ధరలు లేవు. ఒకరోజు ధరలు తగ్గుతున్నాయి. మరోరోజు పెరుగుతున్నాయి. ఇష్టారీతిన ధరలు నిర్ణయిస్తే రైతులు ఎలా బతుకుతారు. అప్పూ సప్పూ చేసి పంటలు పండించి, నాణ్యమైన పంటను మార్కెట్‌కు తీసుకువస్తే ఇక్కడ వ్యాపారులు చౌక బేరాలు పెడుతున్నారు. దిక్కులేని పరిస్థితిలో రైతులు పంటను అమ్ముకుంటున్నారు. రైతుల బాధను ఎవరూ పట్టించుకోవడం లేదు.

– బిక్కసాని గంగాధర్, రైతు, కేశవాపురం, కూసుమంచి మండలం

జెండాపాటకు ముందే కొనుగోళ్లు..

ఖమ్మం ఏఎంసీ పరిధిలో జెండా పాట కాకముందే వ్యాపారులు పంట కొనుగోళ్లను ప్రారంభించారు. జెండాపాట కాకముందే ఏ నిబంధనల ప్రకారం వ్యాపారులు పంటను కొంటారు. పైగా ఇష్టమైతే పంట అమ్ము.. లేదంటే తీసుకుపో.. అని బెదిరిస్తున్నారు. జెండా పాటలో క్వింటాల్ మిర్చి ధర రూ.20,800 పలికితే.. వ్యాపారులు నా పంటను చూసి నాణ్యతపై ఆ సాకు, ఈసాకు చెప్పి రూ.16 వేలు ధర నిర్ణయించారు. నేను మూడెకరాల్లో మిర్చి వేశాను. రూ.4 లక్షల పెట్టుబడి పెట్టాను. అంత చేస్తే 25 బస్తాల పంట మాత్రమే చేతికొచ్చింది. తీరా పంటను మార్కెట్‌కు తీసుకొస్తే ఇక్కడ తీసికట్టు ధరలు. ఇలా చేస్తే రైతులు చావాల్నా..? బతకాల్నా?

– బానోతు శంకర్, రైతు, లక్ష్మీదేవిపల్లి

క్వింటాల్ మిర్చికి రూ.15 వేలు ధరనా..?

రెక్కలు ముక్కలు చేసుకుని నేను మిర్చి పండించాను. 34 బస్తాలు చేతికొస్తే వాటిని మార్కెట్‌కు తీసుకొచ్చాను. వ్యాపారులు నా పంటను చూసీచూడకుండానే క్వింటాకు రూ.15 వేల ధర నిర్ణయించారు. అదేంటి..? అని అడిగితే పట్టించుకునే నాథుడు లేడు. జెండా పాట పెట్టినప్పుడు వ్యాపారుల మధ్య పోటీ రావాలి కదా.. అదేం లేదు. ఒకరిద్దరు గుమస్తాలు వస్తే జెండాపాట జరుగుతుంటే మార్కెట్ అధికారులు ఏం చేస్తున్నారు? ఎర్రటి ఎండలో నాలుగైదు గంటలు గొంతు పోయేలా మొత్తుకుంటే మా బాధలు వింటారా? రైతుల బాధ వినే నాథుడే లేరా..?

– ఎస్కే సలీం, రైతు, గాదెపాడు, కారేపల్లి మండలం, ఖమ్మం జిల్లా

వేసవిలో మంచినీటి ఎద్దడి రానీయొద్దు

- ముందస్తు ప్రణాళిక ద్వారా తాగునీటి సమస్యలు పరిష్కరించాలి
- వ్యవసాయ బోర్లను అద్దె ప్రాతిపదికన వినియోగించుకోవాలి
- అధికారుల సమావేశంలో భద్రాద్రి కలెక్టర్ డాక్టర్ ప్రియాంక

భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 1 (నమస్తే తెలంగాణ): వేసవిలో మంచినీటి సమస్య ఏర్పడకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ప్రియాంక అధికారులను ఆదేశించారు. ముందస్తు ప్రణాళికల ద్వారా సమస్యలను పరిష్కరించాలని సూచించారు. వేసవి సమీపించినందున జిల్లాలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఉండేందుకు చేపట్టాల్సిన చర్యలపై ఐడీవోసీలో ఇంజినీరింగ్ అధికారులతోనూ, వీడియోకాన్ఫరెన్స్‌లో ఎంపీడీవోలు, ఎంపీవోలతోనూ శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మున్సిపాలిటీలు, పంచాయతీల్లో ప్రజలకు నీటి కొరత రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అన్నారు. మోటర్ల రిపేర్లు, చేతిపంపుల మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. పంచాయతీల్లో నీటి పరిశుభ్రత, నీటి సరఫరాపై సెక్రటరీలు, స్పెషల్ ఆఫీసర్లు రోజువారీ సమీక్షలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ వేసవిలో ఎండలు తీవ్రంగా ఉండే ప్రమాదం ఉన్నందున భూగర్భ జలాలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని అన్నారు. సంబంధిత అధికారులు అందుకు అనుగుణమైన చర్యలు తీసుకోవాలన్నారు. గడిచిన మూడేళ్లలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న గ్రామాలను గుర్తించాలని, అక్కడి నీటి ఎద్దడి నివారణకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని సూచించారు. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో అవసరమైతే వ్యవసాయ బోర్లను అద్దె ప్రాతిపదికన వినియోగించుకోవాలని సూచించారు. డీఆర్‌డీవో విద్యాచందన, జడ్పీ సీఈవో ప్రసూనారాణి, మిషన్ భగీరథ ఈఈ తిరుమలేశ్, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ ఇందిర, పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ శేషాంజన్‌స్వామి పాల్గొన్నారు.

మధిరను రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతా..

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క రూ.11 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న భట్టి

ముదిగొండ, మార్చి 1 : రాష్ట్రంలోనే మధిర నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర చర్యలు చేపట్టినట్లు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. శుక్రవారం కట్టకూరు-సీతారాంపురం, గోకినేపల్లి-మేడేపల్లి, గోకినేపల్లి-కట్టకూరు గ్రామాల మధ్య రూ.11 కోట్ల వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. తర్వాత గోకినేపల్లిలో 58 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ ప్రజలు కోరుకున్న ఇందిరమ్మ రాజ్యం వచ్చిందని, మంచి పాలన అందించి వారికి అన్ని విధాలా న్యాయం చేస్తామన్నారు. నాణ్యతలో రాజీ లేకుండా శంకుస్థాపన చేసిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. తాము ఎన్నికల్లో హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను కచ్చితంగా అమలు చేసి తీరుతామన్నారు. ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు చేసిన పాదయాత్రలో తనకు ఎదురైన అనుభవాలతోనే బడ్జెట్ రూపొందించామన్నారు. నిరుద్యోగుల కోసం ప్రతి నియోజకవర్గంలో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ త్వరలోనే ఏర్పాటు చేసి ఆన్‌లైన్ ద్వారా కోచింగ్ అందిస్తామన్నారు. అనంతరం గృహజ్యోతి పథకంలో భాగంగా 200 యూనిట్ లోపు ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రారంభించారు. స్వయంగా బిల్లు తీసి లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో కలెక్టర్ గౌతమ్, పీఆర్ ఎస్ఈ చంద్రమౌళి, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ శ్యాంప్రసాద్, డీఈవో సోమశేఖర శర్మ, డీపీవో హరికిషన్, మిషన్ భగీరథ ఈఈ పుష్పలత, ఎంపీపీ సామినేని హరిప్రసాద్, జడ్పీటీసీ పసుపులేటి దుర్గ, తహసీల్దార్ వై.రామారావు, ఎంపీడీవో శ్రీధర్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

పాలేరు పాత కాలువ వద్ద సీసీ కెమెరాల నిఘా

కూసుమంచి, మార్చి 1: పాలేరు పాతకాలువ ఆయకట్టు రైతులు అనేకసార్లు వరుసగా అనధికారికంగా దిగువకు జలాలు వదులుతుండడంతో ఇరిగేషన్ అధికారులు శుక్రవారం కాలువ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఇప్పటి నుంచి ఇరిగేషన్‌శాఖ ఉన్నతాధికారులు సీసీ కెమెరాల పుటేజీని నిత్యం పరిశీలిస్తారు.


మేడిగడ్డ ప్రాజెక్టును పరిశీలిస్తున్న బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, తదితరులు

అన్నారం ప్రాజెక్టును పరిశీలిస్తున్న కేటీఆర్

మేడిగడ్డకు చేరుకున్న ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, కడియం శ్రీహరి, కౌశిక్ రెడ్డి, తదితరులు

కేసీఆర్‌పై కోపంతో.. రైతులపై పగబట్టకండి

కాళేశ్వరం ప్రాజెక్టు యాత్రలో బీఆర్ఎస్ నేతలు

- మేడిగడ్డకు మరమ్మతులు చేయించి.. నీళ్లను లిఫ్ట్ చేయండి
- 3 పిల్లర్లకు సమస్య వస్తే.. కాళేశ్వరం మొత్తం నష్టపోయిందని బద్నాం చేస్తున్నరు
- రైతులకు కామధేనువు లాంటిది కాళేశ్వరం

'కాళేశ్వరం ప్రాజెక్టు రైతులకు కామధేనువు. అటువంటి కాళేశ్వరాన్ని పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయండి. నీళ్లను వెంటనే లిఫ్ట్ చేసి రైతులకు అందించండి. నల్లగొండ సభలో కేసీఆర్ ఇచ్చిన మాట మేరకు బీఆర్ఎస్ నేతలమంతా మేడిగడ్డకు వచ్చాం. ప్రాజెక్టు రక్షణ చర్యలు చేపట్టాల్సిన ప్రభుత్వమే గోబెల్స్ ప్రచారం నిర్వహిస్తున్నది. దాన్ని అడ్డుకుని ప్రజలకు వాస్తవాలు వివరించేందుకే ఇక్కడికి వచ్చాం. 3 బ్యారేజీలు, 15 రిజర్వాయర్లు, 21 పంపింగ్ స్టేషన్లు, 273 కిలోమీటర్ల పొడవైన టన్నెల్స్, 1500 కిలోమీటర్లకు పైగా ఉండే కాలువలు కలిగిన భారీ ప్రాజెక్టు కాళేశ్వరంలో కేవలం మేడిగడ్డ బ్యారేజీలో 3 పిల్లర్లకు సమస్యలు వస్తే రాద్ధాంతం చేస్తున్నారు' అని బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వ వైఖరిని తూర్పారబట్టారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై జరుగుతున్న దుష్ప్రచారంపై వాస్తవాలు ప్రజలకు తెలియజెప్పేందుకు బీఆర్ఎస్ నేతలు శుక్రవారం చేపట్టిన చలో కాళేశ్వరంలో భాగంగా ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్‌రావు, కడియం శ్రీహరి మాట్లాడారు. కేసీఆర్‌పై కోపముంటే ఆ కోపాన్ని దయచేసి రైతులపై రాష్ట్రంపై చూపవద్దని వారు కోరారు. ఆలస్యం చేయకుండా మేడిగడ్డకు మరమ్మతులు చేయించి రైతులకు సకాలంలో నీళ్లు అందేలా చూడాలని చెప్పారు.


మేడిగడ్డ ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, తదితరులు


మేడిగడ్డ ప్రాజెక్టు వద్ద బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎంపీ నామా నాగేశ్వర్‌రావు, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి, తదితరులు


ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, వేముల ప్రశాంత్ రెడ్డి, ప్రకాశ్ గౌడ్, కౌశిక్ రెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, గండ్ర వెంకటరమణా రెడ్డి, మాజీ ఎంపీ బి.వినోద్‌కుమార్, దేవిప్రసాద్, తదితరులు

మెడిగడ్డ వద్ద రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, బీవకొండ దామోదర్‌రావు తదితరులు